
# అద్దం

జి.సి.జీవి



"కమిన్!" అన్నాడు చిరంజీవి కాన్ఫిడెన్సియల్ ఫైల్లోంచి తల ఎత్తకుండానే స్వింగ్ డోర్ తలుపులు నెట్టుకుని లోపలికొచ్చేడు అతను

"కూర్చోండి" అని ఫైలుమూసి టేబిలు డ్రాయరు సొరుగులో పెట్టాడు చిరంజీవి. తనకెదురుగా కుర్చీలో కూర్చున్న అతనికేసి కొద్దిక్షణాలు పరిశీలనగా చూశాడు ఆ వచ్చిన వ్యక్తికి దాదాపు నలభైయేళ్ళుంటాయి అతను గడ్డంగీసుకుని చాలారోజులైనట్టుంది తలంతా అక్కడక్కడ నెరిసుంది. పొట్టిచేతుల చొక్కా, మాసిపోయిన పంచె ధరించి వున్నాడు

"డిటెక్టివ్ చిరంజీవిగారిని కలుసుకుందామని వచ్చాను" అన్నాడు అతను.

చిన్నగానవ్వి "నేనే, చెప్పండి. ఏం పనిమీదొచ్చారో" అన్నాడు చిరంజీవి. ఆ వ్యక్తి ఒక క్షణం విస్తుపోయి కుర్చీలో సర్దుకుని కూర్చున్నాడు. ఆ గదిలో ఓ మూల టైపుమిషను ముందు కూర్చుని దీక్షగా ఏవో కాగితాలు టైపుచేసుకుంటూన్న అందమైన అమ్మాయి వంక చూసి కాసేపు తటపటాయించాడు.

"ఆవిడ నా పర్సనల్ సెక్రటరీ. డాక్టర్లదగ్గర, లాయర్లదగ్గర రహస్యాలు పనికిరావంటారు. అలాగే మా విషయంలోనూ మా సహాయం మీకు కావాలంటే మిమ్మల్ని గురించి మాకు తెలియాలి క్లయింట్సుని గురించిన సమాచారాన్ని రహస్యంగా వుంచడం మా వృత్తి ధర్మాలలో మొదటిది ఈ

నియమం పాటించనందువల్లనే ఈ నగరంలో వెలసిన ఎన్నో ప్రైవేటు డిటెక్టివ్ ఏజెన్సీలు సంవత్సరంపాటు కూడా నిలబడలేకపోయాయి. ప్రారంభించి అయిదేళ్ళయినా మా ఏజెన్సీ స్థిరంగా నిలదొక్కుకుందంటే 'ప్రొఫెషనల్ హానెస్టీ'ని మేము పాటిస్తూన్నందువల్లనే. ఇప్పుడు చెప్పండి మీ పేరూ?" అని సిగరెట్టు వెలిగించేడు చిరంజీవి.

చొక్కా జేబులోంచి ఒక ఫోటో బయటికి తీసి చిరంజీవి చేతికిచ్చాడు అతను

"ఈ అమ్మాయి పేరు జరీనా. వర్కింగ్ విమెన్సుహాస్టల్లో వుంటోంది. ఈమెనుగురించిన పూర్తి భోగట్టా మీరు సేకరించాలి. నా ప్రాణమిత్రుడొకడు ఈ అమ్మాయిని గాఢంగా ప్రేమిస్తున్నాడు త్వరలో ఇద్దరూ పెళ్ళికూడా చేసుకోవాలనుకుంటున్నారు. కాని నాకిష్టంలేదు" అన్నాడు అతను.

"ఎందుకని?" అడిగాడు చిరంజీవి.

"ఆ అమ్మాయి నడవడి మీద చాలా అనుమానాలున్నాయి నాకు. కాని నేనెంత చెప్పినా వినిపించుకోవటంలేదు, మావాడు. నా సందేహాలన్నీ కేవలం నిరాధారమైనవని తేల్గ్గా కొట్టిపారేస్తున్నాడు. వాడి నమ్మకమే నిజమయ్యే పక్షంలో నాకన్న ఎక్కువగా సంతోషించే వాళ్ళుండరు. కాని..." అని ఒక్కక్షణం ఆగేడు అతను.

"ఊ.... చెప్పండి." అన్నాడు చిరంజీవి

"జరీనాను గురించిన నా అనుమానాలే నిజమైతే చూస్తూ చూస్తూ వాడి జీవితం బలికావటం నేను సహించలేను" అని ముగించేడు అతను.

తన చేతిలోని కార్డుసైజు ఫోటోని మరొకసారి పరిశీలనగా చూశాడు చిరంజీవి. ఫోటోలోని అమ్మాయి చాలా అందంగా, ఆరోగ్యంగా కనిపిస్తోంది. పాతికేళ్ళుకూడా నిండివుండవు. స్లీవ్‌లెస్ జాకెట్టు తొడుక్కుని, బాబ్డ్ హెయిర్ స్టయిల్లో ఎంతో ముచ్చటగా వుంది.

"ఇంతకీ మీపేరు చెప్పనేలేదు." అన్నాడు చిరంజీవి ఫోటోని కవరులో పెట్టేస్తూ.

"క్షమించాలి. కొన్ని కారణాంతరాల చేత నాపేరు ప్రస్తుతానికి రహస్యంగా వుంచాలనుకుంటున్నాను. దయచేసి బలవంతపెట్టకండి అయినా జరీనాను గురించిన సమాచారం సేకరించడంలో నాపేరు మీ కేవిధంగానూ వుపయోగపడదు."

"మీరలా అనుకోవటం పొరపాటు. పని పూర్తయిపోయాక రేపు ఫీజు వసూలు చేసుకోవటానికైనా మీపేరూ, అడ్రసూ తెలియాలిగదా మాకు" అన్నాడు చిరంజీవి నవ్వుతూ.

"ఎంతమాట! మీకా సందేహం అక్కరలేదు. మీ ఫీజు ఇప్పుడే ఇస్తాను"

అంటూ చేతి సంచీలోంచి పదిరూపాయల నోట్లకట్ట ‌. రెండు తీసి టేబులుమీద పెట్టాడు అతను.

"మీరు జరీనాను గురించి రిపోర్టు తయారుచేసి ఇవ్వగానే మిగతా బేలెన్సు ఇచ్చేస్తాను "

నోట్ల కట్టల్ని చేతిలోకి తీసుకుని విలాసంగా విరుస్తూ "ఇక మీరేమీ ఇవ్వ నవసరం లేదు. ఈ పనికి మా ఫీజు రెండువేలే." అని డబ్బుని డ్రాయరు సొరుగులో పెట్టి తాళం వేశాడు చిరంజీవి.

"చాలా థాంక్స్ మళ్ళీ ఎప్పుడు రమ్మంటారు" అంటూ లేచాడు అతను.

"నెల రోజులు పోయాక రండి. రిపోర్టు రెడీగా వుంటుంది."

అతను వెళ్ళిపోయాడు.

"మిస్ రేఖా!" పిలిచాడు చిరంజీవి.

టైపుచేయడం ఆపి అతని దగ్గర కొచ్చి నిలబడింది మిస్ రేఖ.

"ఈ పని నీకప్పగిస్తున్నాను, చెయ్య గలవా ?"

"ష్యూర్" నవ్వుతూ అంది.

"గుడ్ ! అయితే రేపట్నుంచే ఇన్వెస్టిగేషన్ ప్రారంభించు" అని జరీనా ఫోటోని ఆమె చేతికిచ్చాడు.

* * *

ఇంటికితిరిగొచ్చి నిలువుటద్దంముందర నిలబడ్డాడు అతను. ఈ వేషంలో తనని తాను పోల్చుకోవటమే కష్టంగావుంది. ఎంత డిటెక్టివ్ అయితే మాత్రం బోల్తా పడకుండా ఎలా వుంటాడు. స్నేహితుని తరపున వచ్చేనంటే నిజంగా నమ్మే సేడు పాపం అందుకే అన్ని ప్రశ్న లడిగేశాడు తనకి జరీనా మంచి అమ్మాయిలాగే కనిపిస్తోంది. మొదటి పరిచయంలోనే ఆమెను శాశ్వతంగా సొంతం చేసుకోవాలనే కోరిక స్థిరపడింది మనసులో. ఇంతకాలమూ తాడులేని బొంగరంలా తయారైన తన జీవితాన్ని క్రమబద్ధం చేసుకోవాలనే ఆలోచన కలి గింది. అందుకు అన్ని విధాలా తగిన వ్యక్తి జరీనా. ఎందుకైనా మంచిది తుది నిర్ణయం తీసుకునేముందు ఆమె పుట్టు పూర్వోత్తరాలు గురించి కొంత తెలుసు కోవడం మంచిదనిపించింది. కాని ఆ ప్రసక్తి ఎప్పుడు తెచ్చినా అదోరకంగా ముఖం మాడ్చుకునేది జరీనా.

"నామీద నమ్మకంలేదా మీకు ?" అని మాట తప్పించేది. తన గతాన్ని గుప్తంగా వుంచాలని ఆమె ప్రయత్నించే కొద్దీ ఆమెని గురించి తెలుసుకోవాలనే పట్టుదల పెరిగింది తనలో. ఫలితంగా ఈరోజు 'చిరంజీవి ఏజెన్సీస్' సహాయం పొందాల్సి వచ్చింది .

విగ్గు తీసి మూలకు విసిరేసేడు అతడు. బాగా పెరిగిన గడ్డాన్ని నున్నగా గీసుకున్నాడు. స్నానంచేసి వచ్చి ముఖానికి 'ఫేర్ అండ్ లౌలీ' రాసు కున్నాడు. ఎప్పటిలా టిప్‌టాపుగా తయారయ్యాడు. హుషారుగా ఈల వేసుకుంటూ 'పామ్‌గ్రోవ్' కి బయలు దేరాడు జరీనాని కలుసుకోవటానికి.

* * *

నెల రోజుల తరవాత...

ఆదే మాసినపంచె, పొట్టిచేతుల చొక్కా, పెరిగిన గడ్డం అక్కడక్కడా నెరిసిన జుట్టుతో చిరంజీవి ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు అతను

"రిపోర్టు తయారయిందా ?"

"మూడ్రోజుల కిందటే రెడీ అయింది" టేబిలు సొరుగులాగి సీలు చేసిన ఒక పొడుగాటి కవరు అతని చేతికిచ్చాడు చిరంజీవి

"చాలా థేంక్సండీ వస్తాను" అని సెలవు తీసుకున్నాడు అతను ఆగ మేఘాలమీద ఇల్లు చేరుకున్నాడు గదిలో తలుపులు బిగించుకుని, ఆతృతగా కవరు చింపి రిపోర్టుకాయితాన్ని బయటికి తీశాడు...

జరీనా పుట్టుపూర్వోత్తరాలు :

జరీనాపుట్టింది ఇండోనీషియాలో ఇరవైయేళ్ళ కిందట ఆమె తలిదండ్రులు స్వదేశం వదలిపెట్టి భారత దేశంలో స్థిరపడ్డారు. ఇక్కడికొచ్చిన మూడేళ్ళకి ఒక కారుప్రమాదంలో తలిదండ్రులిద్దరినీ కోల్పోయింది జరీనా. బొంబాయిలోని ఒక అనాథాశ్రమంలో పెరిగి, అక్కడే చదువుకుని మెట్రిక్ పాసయింది ఇండియన్ ఏర్‌లైన్సులో టైపిస్టుగా చేరింది. అయిదేళ్ళక్రితం ఈ వూళ్ళోని బ్రాంచి ఆఫీసుకి ట్రాన్స్‌ఫరయి వచ్చింది మెట్రిక్యులేషన్ స్కూల్ రికార్డు ప్రకారం ఆమె వయసు ఇప్పుడు ఇరవై నాలుగు సంవత్సరాల ఆరునెలలు

ఇటీవల సంగతులు

జరీనా చాలా అమాయకురాలు. మనుషుల్లోని మోసాల్ని పసిగట్టే లౌక్యం ఆమెకింకా అలవడలేదు. కొంత కాలంగా అంటే సుమారు అయిదారు మాసాలుగా జరీనా ఒక పెద్దమనిషి'తో తిరుగుతూంది. అసలు రంగు తెలిస్తే అతని వల్లో పడేదికాదు అతనికి లేని దుర్వ్యసనాలు లేవు అంటువ్యాధి సుఖవ్యాధి లేదు. కంపెనీ డబ్బుని కొన్నివేలు కాజెయ్యటమేగాక, పన్నులుఎగవేసి ప్రభుత్వాన్నికూడా అనేక రకాలుగా మోసం చేస్తూన్నాడు ఈతడు- ఏక్షణంలోనైనా ప్రభుత్వానికి పట్టుబడి జెయిలుకు పోవల్సిన పరిస్థితిలోదివున్నాడు. ఈ వూళ్ళో ఎరువుల తయారీకి సంబంధించిన ఒక ప్రముఖ వ్యాపారసంస్థకి మేనేజింగు పార్టనరు ఈ పెద్దమనిషి

మా సలహా

జరీనాను ఈ పెద్దమనిషి బారినుండి ఎంత త్వరగా రక్షిస్తే అంత మంచిది.

చదవటం ముగించి కసితో రిపోర్టు కాయితాన్ని ముక్కలుగా చించి, వుండచుట్టి నేలకేసి విసిరికొట్టాడు అతను

"ఛీ! నన్ను గురించి నేను తెలుసుకోటానికి ఈ డిటెక్టివ్ వెధవలకి రెండువేలు ధారపోశాను" అని తనని తిట్టుకున్నాడు. విసురుగా తలుపులు తెరుచుకుని హాల్లోకొచ్చి అద్దంముందు నిలబడ్డాడు ఇప్పుడతనికి అద్దంలో తన మారువేషం కనిపించటంలేదు పోలీసాక్షీసర్లూ, సి.బి.ఐ. అధికారులూ కనిపించేరు నివ్వెరపోయి వెనక్కి తిరిగేడు అతను